దివ్యపాశుర పఠనం ముక్తిదాయకం

విజయవాడ కల్చరల్: దివ్యపాశుర పఠనం ముక్తి దాయకమని ఆధ్యాత్మికవేత్త నరసింహాచార్యులు అన్నారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యం లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభంగా సాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పాశురపఠనం భక్తిగా సాగింది. నరసింహాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాసం విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసమని ప్రాతహః కాలంలో విష్ణునామ జపం, పాశురాలను పారాయణం చేయడం వల్ల సర్వపాపాలు హరిస్తాయన్నారు. దేవాలయ ట్రస్టీబోర్డ్ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీ ఆదేశాల మేరకు డివిజన్లోని హరిహరక్షేత్రం దగ్గర అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బుధవారం వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, బోరాబుజ్జి పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

తుర్లపాటి పాత్రికేయ సేవలు వెలకట్టలేనివి

ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

విజయవాడ కల్చరల్: తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయ సేవలు వెలకట్టలేనివని ఏపీ సీఆర్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఏపీ సీఆర్ ప్రెస్ అకాడమీ, తెలుగు కళావాహిని, కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం తుర్లపాటి ద్వితీయ వర్థంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుర్లపాటి నిజజీవితం– పాత్రికేయ జీవితం వేర్వేరు కాదన్నారు. ఆయన జీవితమంతా పాత్రికేయం లాగానే సాగిందన్నారు. వార్తలోని వ్యక్తుల శీర్షికన అనేకమందిని లోకానికి పరిచయ చేశారన్నారు. 18 వేలకు పైగా ఉపన్యాసాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో చరిత్రలో నిలచిపోయాలే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రపంచంలో అంతగొప్ప నివాళి ఏ కుమారుడూ ఇవ్వలేదని, అదే సంప్రదాయాన్ని తుర్లపాటి కుమారుడు జవహర్ పాటిస్తునట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీ నాగిరెడ్డి మాట్లాడుతూ యువ జర్నలిస్టులు తుర్లపాటి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏనాడూ విలువలను వదులుకోలేదని, ఏ పార్టీ పక్షాన పనిచేయలేదని, అటువంటి వ్యక్తులు నిజ జీవితంలో తక్కువగా కనిపిస్తారన్నారు. తుర్లపాటి కుమారుడు జవహర్‌ను కొమ్మినేని శ్రీనివాసరావును ఆత్మీయంగా సత్కరించారు. శ్రీకళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆయన జీవితం అంతా నగరంతోనే ముడిపడి ఉందన్నారు. విద్యావేత్త ఎంసీ దాస్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, తుర్లపాటి కుమారుడు జవహర్‌లాల్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



సంక్రాంతి సంబరాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగ అని లయన్స్‌క్లబ్ సభ్యుడు అంజూరి శేషుబాబు అన్నారు. స్థానిక మాచవరం వాణీ స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి విష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు సంక్రాంతి ఉట్టిపడేలా చేసిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, భోగిపళ్లు, చెరకుగడలు, పిండివంటలు చేస్తూ విద్యార్థులు సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూలు హెచ్ఎం ఎ.ఝాన్సీలక్ష్మీబాయి పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్ మెయిన్ రోడ్డులోని గౌతమ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను స్కూలు కరస్పాండెంట్ నెక్కంటి ప్రసాద్ పర్యవేక్షించారు.

యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ యానాదుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. బుధవారం లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఏపీ యానాదాలు సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కుడుముల రామచంద్రయ్య, ఛైర్మన్‌గా బాపట్ల ప్రసాదరావు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబు మాట్లాడుతూ గిరిజనులకు ముఖ్యంగా యానాదులకు సముచితమైన స్థానం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు

యూపీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీల నియామకంపై మార్గదర్శకాలను తెలియజేశారు. నగరంలోని యూపీహెచ్‌సీ ఉన్న ప్రాంత కార్పొరేటర్ ఛైర్మన్‌గా , డీపీయంఓ/ప్రోగ్రామ్ అధికారి కో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. కాగా యూపీహెచ్‌సీ వైద్యాధికారి కన్వీనర్‌గా, మున్సిపల్ కమిషనర్, ప్రజారోగ్య అధికారి, మహిళా స్త్రీ సంక్షేమశాఖ సెక్టార్ సూపర్‌వైజర్, మహిళా ఆరోగ్య సమితి ఛైర్‌పర్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటరీ సెక్రటరీలో సభ్యులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్‌సీడీ,సీడీ, ఆర్‌సీహెచ్ ప్రగతి, ఏఎన్‌సీ, పీఎన్‌సీ, హై రిస్క్ కేసులకు అందిస్తున్న సేవలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, ఆర్‌బీఎస్‌కే సమన్వయాధికారి డాక్టర్ మాధవి, డీపీఓ మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డ్ సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారికి మెరుగైన సేవలను అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నూపూర్ అజయ్ సూచించారు. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలోని వార్డ్ సచివాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. గృహనిర్మాణ పథకం, ఓటీఎస్, పెన్షన్, నిత్యవసర వస్తువుల సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నార్త్‌జోన్ తహసీల్దార్ చందన దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు కాపు అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కోపా) ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోపా అధ్యక్ష, కార్యదర్శులు కొప్పరాతి వెంకట రమణారావు, రామాయణం నాగసత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, పోలిటెక్నిక్, పిజీ చదువుతున్న ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సమాచారం కోసం 93477 99123లో సంప్రదించాలని కోరారు.

14న గోదారంగనాథ కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని షిరిడీ సాయి బాబా మందిరంలో ఈ నెల 14వ తేదీన ఉదయం తొమ్మిది గంటలకు విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యంలో కొల్లిపర రమేష్‌బాబు దంపతుల సహకారంతో శ్రీ గోదారంగనాథస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు మండలి కన్వీనర్ సత్య శ్రీహరి బుధవారం తెలిపారు. లోక కల్యాణార్థం తలపెట్టిన కల్యాణోత్సవంలో కల్యాణ మాలను వివాహం కావాల్సిన వధూవరుల మెడలో వేయనున్నట్లు పేర్కొన్నా

గౌతంరెడ్డికి అభినందనలు



గౌతంరెడ్డికి అభినందిస్తున్న నాయకులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పూనూరు గౌతంరెడ్డిని పలువురు యూనియన్ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ హౌస్‌లోని ఆయన కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజారెడ్డి, రాష్ట్ర నాయకులు నరహరిశెట్టి శ్రీహరి, నారాయణరెడ్డి, వెంకటప్పారెడ్డి, సురేష్, రాజేష్ తదితరులు కలిసి అభినందనలను తెలిపారు.

భార్యాభర్తలపై దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ ఇంటిని కూల్చుతున్నారని అడ్డుకునేందుకు వెళ్లిన భార్యాభర్తలపై దాడి చేసిన ఘటన భవానీపురం స్టేషన్ పరిధిలోని ఊర్మిళానగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు భవానీపురం వెలంపల్లి కాలనీకి చెందిన కొడాలి చంద్రానికి ఊర్మిళానగర్‌లో 100 చదరపు గజాల స్థలం ఉంది. ఆ స్థలంలో రేకులతో ఇంటిని నిర్మించుకున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో భవానీపురానికి చెందిన అబ్దుల్ కరీముల్లా అనే వ్యక్తి అనుచరులు జేసీబీతో ఇంటిని కూల్చేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో తెలిసిన వారు ఫోన్‌చేయగా అడ్డుకునేందుకు వెళ్లిన కొడాలి చంద్రం అతడి భార్యపై అబ్దుల్ కరీముల్లా అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఘటనపై బాధితులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

డేటా ఎనాలసిస్ రంగంలో విస్తృత అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ వ్యాపితంగా డేటా ఎనాలసిస్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని కేఎల్ విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ శివకుమార్ అన్నారు. కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాట్‌స్టిక్స్ ఆధ్వర్యంలో 'పైతాన్ ఫర్ డేటా ఎనాలసిస్' అంశంపై ఐదు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ముగింపు సభలో డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా డేటా ఎనాలసిస్ రంగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. దీనిపై పట్టు సాధించడం ద్వారా ఆయా అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను, అభివృద్ధిని తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకులు లక్ష్మప్రసన్న, పీహెచ్ రాధ, డాక్టర్ పీ శేషుబాబు, డాక్టర్ సీహెచ్‌వీవీఎస్ సురేశ్, సీహెచ్ సౌజన్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూడారై

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కూడారై జరిగింది. ఆలయ అర్చకులు స్వామికి వెయ్యి ఎనిమిది గిన్నెలతో పాయం నివేదన చేశారు.

రేపు ముగ్గుల పోటీలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపమైన సంక్రాంతి పండగను పురస్కరించుకుని 33వ డివిజన్‌లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించనున్నట్లు స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 13న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు డివిజన్ మహిళలకు సత్యనారాయణపురం, గిరివీధిలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గిరివీధిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

చెస్ శిక్షణ తరగతులు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత చదరంగం శిక్షణ తరగతులను అజిత్‌సింగ్‌నగర్, మారుతీనగర్, పోరంకిలో బుధవారం ప్రారంభమయ్యాయి. కోచింగ్ అకాడమీ చీఫ్ ఆర్బిటర్ ఎన్.ఎం.ఫణికుమార్ ఈ తరగతులను ప్రారంభించారు. సింగ్‌నగర్, పోరంకి ప్రాంతాల్లో సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు, మారుతీనగర్‌లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. నేషనల్ ఆర్బిటర్ ఎం.డి.గఫర్, కోచ్ జి.రామకృష్ణ క్రీడాకారులకు శిక్షణ ఇస్తారని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనసూయాదేవి సూచించారు. స్థానిక దేవీనగర్‌లో బుధవారం 247 సచివాలయంలో జగనన్న ఇళ్లు వచ్చిన లబ్ధిదారుల సమావేశం జరిగింది.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

రామకృష్ణాపురంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాద బాధితులు కె రవీంద్రరెడ్డి కుటుంబ సభ్యులకు బుధవారం కార్పొరేటర్ జానారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు.


చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. స్థానిక దుర్గాపురం గౌతమ స్కూల్‌లో బుధవారం దిశ అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దిశ ఎస్సై పూర్ణిమ పాల్గొన్నారు.

సమస్య రహిత డివిజన్ లక్ష్యంగా పనులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 33వ డివిజన్‌ను సమస్య రహిత డివిజన్‌గా మార్చడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. బుధవారం డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో డివిజన్ పర్యటలో స్థానికుల ఇబ్బందులు తెలుసుకుని, తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నగరపాలకసంస్థ ఏఈ నాగరాజు, వైఎస్సార్ సీపీ డివిజన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రథమ వర్ధంతి



జననం:
31-01-1972

మరణం:
12-01-2022

శ్రీమతి కళ్ళే లలిత గారు

మంచితనం, మమతానురాగాలు మాకు పంచి ఆత్మీయత, అనుబంధాలతో మా అందరి హృదయాలలో
సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకొని మాకై జీవితాంతం శ్రమించి మా జీవితాలకు బంగారుబాట ఏర్పాటు చేసిన
కీ॥శే॥ శ్రీమతి కళ్ళే లలిత గారు మా నుండి దూరమై నేటికి ఒక సంవత్సరం గడిచినా
మీ మధుర జ్ఞాపకాలు మరువలేకున్నాం.. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త : **కళ్ళే నాగేశ్వరరావు**

కుమార్తెలు	-	అల్లుళ్ళు :
సీతామహాలక్ష్మి	-	ముప్పూరి హరీష్
జయదుర్గ	-	గుద్దిటి కిరణ్‌కుమార్
మేఘవాణి	-	వేల్పుల నూతన్ కుమార్

మనుమలు: ముప్పూరి జశ్విన్, గుద్దిటి ధృవన్

మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

సంవత్సరీకం : ది. 12-01-2023 గురువారం బందరు రోడ్డు, A+ కన్వెన్షన్ నందు జరుగును.

విగ్రహావిష్కరణ : నా ప్రియ మిత్రులు శ్రీ బుద్ధా వెంకన్న - శ్రీమతి భూలక్ష్మీ దంపతులచే
సింగ్‌నగర్, రైతుబజార్ దగ్గర కళ్ళే లలిత వారి వీధిలో కీ॥శే॥ శ్రీమతి కళ్ళే లలిత గారి విగ్రహావిష్కరణ జరుగును.